అందని సంచార వైద్యం!

నియోజకవర్గానికి ఒకే సంచార పశువైద్య అంబులెన్స్

- ఏ రోజు ఎక్కడ ఉంటుందో తెలియని వైనం
- మరో వాహనం కేటాయించాలని వేడుకోలు



గేదెలకు చికిత్స చేస్తున్న సంచార పశువైద్య అంబులెన్స్ సిబ్బంది

వైరారూరల్: మూగజీవాలకు ఇంటి వద్దనే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో సుమారు ఆరేళ్ల క్రితం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1962 పశు సంచార వైద్యశాల అంబులెన్స్‌లు పాడి పశువుల రైతులకు ధీమాను అందించడంలో వైఫల్యం చెందుతున్నాయి. మొబైల్ సేవలను ప్రారంభించినప్పటికీ తగిన వాహనాలు కేటాయించడంలో మాత్రం వైఫల్యం చెందింది. దీంతో మూగజీవాలకు ఇంటి వద్ద వైద్యం అందని ద్రాక్షలా మారింది. నియోజకవర్గానికి కేవలం ఒక్క పశు సంచార వైద్యశాల అంబులెన్స్ మాత్రమే ఉండడం ఆ వాహనం నియోజకవర్గ పరిధిలోని ఏ మండలంలో ఉంటుందో తెలియని పక్షంలో మూగజీవాలకు సకాలంలో అత్యవసర వైద్యం అందక పాడి రైతులు తలలు పట్టుకుంటున్నారు.

మండలంలో ఇలా..

మండల కేంద్రమైన వైరాతో పాటు పాలడుగు గ్రామాల పాడి రైతులకు తమ మూగజీవాలకు ఏదైనా వ్యాధి సోకితే దగ్గర్లోని సబ్‌సెంటర్లు లేదా 1962 పశు సంచార వైద్యశాల అంబులెన్స్‌కు ఫోన్ చేసి పశువులకు వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అదే విధంగా పశువులు పాము కాటుకు గురైతే సమీపంలోని గోపాలమిత్రులను సంప్రదించి ప్రైవేటు దుకాణాల మందులతో వైద్యం చేయించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.

మరో వాహనం కేటాయిస్తేనే..

మండలంలోని పాలడుగులో ఉన్న పశు వైద్యశాలలో వైద్యుడి పోస్టు ఖాళీగా ఉండడంతో పాటు పలు సబ్‌సెంటర్లలో అటెండర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో రైతులు సకాలంలో పశువైద్యం అందక తీవ్ర ఇబ్బందులుపడుతూ ప్రత్యామ్నాయం లేక గోపాల మిత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈ సమయాన అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాడి రైతుల సౌకర్యార్థం నియోజకవర్గ కేంద్రానికి మరో పశు సంచార అంబులెన్స్‌ను కేటాయించి మూగజీవాలకు సకాలంలో వైద్యసేవలు అందించేలా తగు చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

నియోజకవర్గానికి ఒకే వాహనం..



నియోజకవర్గానికి కేటాయించిన వాహనం

ఉన్న ఒకే ఒక్క అంబులెన్స్‌కు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న పశువులకు సేవలు అందించడం పెనుసవాల్‌గా మారింది. నియోజవర్గకేంద్రమైన వైరాతో పాటు కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి, జూలూరుపాడు మండలాల్లోని పాడి రైతుల ఫోన్‌కు స్పందించి మూగజీవాలకు వైద్యం అందించాల్సి ఉంది. ఇదే తరుణంలో మూగజీవాలకు ఏదైనా అత్యవసర వైద్యం చేయాల్సి వస్తే.. అంబులెన్స్ అందుబాటులో లేనందున పాడి రైతులు విసుగు చెందుతున్నారు. అంతేకాకుండా ఈ మొబైల్ అంబులెన్స్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పని వేళలు ఉన్నట్లు సమాచారం. రోజుకు 8 గంటలు మాత్రమే అంబులెన్స్ పని వేళలు ఉండడంతో అత్యవసర వైద్య సేవలకు ఒక రోజు ముందుగానే 1962కు కాల్ చేసి ముందస్తు సమాచారం ఇవ్వాల్సి వస్తుందని పాడి రైతులు వాపోతున్నారు.

వైద్య సేవలు అందడం లేదు



పాలడుగు పశువైద్యశాలలో రెగ్యులర్ వైద్యుడు లేకపోవడం సకాలంలో పశు సంచార అంబులెన్స్ అందుబాటులో ఉండకపోవడం వలన మూగజీవాలకు వైద్యం అందడం లేదు. పశువులకు ఏదైనా అత్యవసర వైద్యం చేయించాలంటే 1962కు ఒక రోజు ముందుస్తు సమాచారం ఇవ్వాల్సి వస్తుంది. పాడి రైతుల సౌకర్యార్థం పశు సంచార వాహనం నిత్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

–కోసూరి వెంకటరమణ, పాడి రైతు, పాలడుగు

మరో వాహనాన్ని కేటాయించాలి



వైరా నియోజకవర్గానికి సంబంధించి 1962 పశు సంచార వైద్యశాల వాహనాన్ని మరొకటి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నియోజకవర్గానికి ఒక్క వాహనం మాత్రమే ఉండడం వలన పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. 1962కు ఫోన్ చేస్తే పశు సంచార వాహనం ఏ మండలంలో ఉందో తెలియని పరిస్థితి. అధికారులు సానుకూలంగా స్పందించి మరో వాహన కేటాయింపుపై దృష్టి సారించాలి.

– కూరాకుల కృష్ణయ్య, దాచాపురం

క్లుప్తంగా

బోనకల్ ఎంపీడీఓగా రమాదేవి బాధ్యతలు



బోనకల్: బోనకల్ ఎంపీడీఓగా రమాదేవి శుక్రవారం విధుల్లో చేరి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలాభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం కొద్దిసేపు సిబ్బందితో మాట్లాడారు.

వేంసూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా..

వేంసూరు: వేంసూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న రమాదేవి బదిలీపై వెళ్లడంతో సత్తుపల్లి ఎంపీడీఓ ఆర్‌సీహెచ్.నాగేశ్వరరావు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

విద్యార్థినికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న గ్రేట్ విజన్ బాధ్యులు

వైరా: వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వల్లాపురం గ్రామానికి చెందిన ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని మాగంటి మధురకు ఫీజుల నిమిత్తం క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయాన్ని క్లబ్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేట్ విజన్ బాధ్యులు ఉంగ్రూ శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, ఉంగ్రూ వరలక్ష్మీ, గంగవరపు కిషన్, జాలా పుల్లారావు, వుయ్యూరు రామకృష్ణ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ కమిటీ ఎన్నిక



అధ్యక్ష కార్యదర్శులు వీరాస్వామి, ప్రసాదరావు

కొణిజర్ల: టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా చిలుకూరి వీరాస్వామి, ప్రధాన కార్యదర్శిగా మాదాల ప్రసాదరావు, కోశాధికారిగా ఏ.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా రత్న సునీలారాణి, పాటి శ్రీనివాస్, కార్యదర్శులుగా రమణ, ఎల్.జితేష్ సాహిల్, కె.నాగేశ్వరరావు, ఆర్.కనకవల్లి, ఎస్‌కె.ఖాదర్, ఎస్.రమేష్, ఆర్.బాలయేసు, మండల ఆడిటర్‌గా కె.తిరపయ్య, మహిళా కన్వీనర్‌గా టి.విజయలక్ష్మీ, జిల్లా ప్రతినిధులుగా ఎస్.రాజేశ్వరి, ఎం.నర్సింహులు, పి.మురళీ కృష్ణ, ఎల్.జితేష్‌సాహిల్‌లను ఎన్నుకున్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో నాగులవంచ నుంచి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా పోలంపల్లి గ్రామం వరకు నిర్మించనున్న బీటీ రహదారి నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క రూ. 5 కోట్లు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, నెల్లూరి రమేష్, అంబటి శాంతయ్య, కోలేటి నాగేశ్వరరావు, అంబటి సైదేశ్వరరావు, కూచిపూడి రామారావు, బైరు వెంకటేశ్వర్లు, రామారావు, రవి, తురక వెంకన్న, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

చికున్‌గున్యాతో వ్యక్తి మృతి

వైరా: వైరాలో చికున్‌గన్యాతో వ్యక్తి మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వైరాకు చెందిన తల్లాపురెడ్డి సత్యనారాయణరెడ్డి (74) 20 రోజుల క్రితం చికున్‌గన్యా బారిన పడి విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు



అభినందిస్తున్న శీలం వెంకటరెడ్డి

మధిర: ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన భరత్ స్కూల్ విద్యార్థులను శుక్రవారం ఆ పాఠశాలలో భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో సైతం అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన తల్లపురెడ్డి రమ్య, బాజినేని చంద్రిక, వేమిరెడ్డి లాస్యలను అభినందించి గోల్డ్ మెడళ్లు, మెమెంటోలను అందజేశారు. విద్యార్థులను అభినందించిన వారిలో ప్రిన్సిపల్ జింకల కోటేశ్వరరావు, ఉమ, డీన్ కటికల రవీందర్ రెడ్డి, స్రవంతి, నీలిమ, రవి ఉన్నారు.

నీటి సరఫరాలో ఆపరేటర్లే కీలకం



తల్లాడ: అవగాహన కల్పిస్తున్న అధికారులు

తల్లాడ: మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో పంపు ఆపరేటర్లే కీలమకమని మిషన్ భగీరథ సత్తుపల్లి డీఈ జయలక్ష్మీ అన్నారు. మండలంలోని మల్లవరం గ్రామంలో నాలుగు రోజుల పాటు జరిగిన పంపు ఆపరేటర్ల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా జయలక్ష్మీ మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ మోటార్లు, పైపులైన్లు, వాటర్ టెస్టింగ్‌లు, చేతిపంపుల మరమ్మతులపై అవగాహన కల్పించారు. ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సింధు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బొగ్గుల శ్రీనివాసరెడ్డి ఉన్నారు.



ముదిగొండ: శిక్షణ పూర్తి చేసుకున్న తాగునీటి సహాయకులు

ముదిగొండ: మండలకేంద్రంలోని రైతువేదికలో మూడు రోజుల నుంచి జరుగుతున్న గ్రామీణ మంచినీటి సహాయకుల శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మిషన్‌భగీరథ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగురోజుల శిక్షణ అనంతరం సహాయకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో భగీరథ ఏఈ విజయరాజు, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకి కిషోర్, సహాయకులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వాలకు ఆదరణ



సభ్యత్వం అందజేస్తున్న రామలింగేశ్వర్‌రావు

తల్లాడ: బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందనీ బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని మల్లవరం గ్రామంలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల బీజేపీ సభ్యత్వాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు అందులో భాగంగా జిల్లాలో 50 వేల సభ్యత్వం లక్ష్యంగా కాగా సత్తుపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే 10 వేల సభ్యత్వం పూర్తి కావొచ్చిందన్నారు. దేశాభివృద్ధికి బీజేపీ కృషి చేస్తుందని భావనతో సభ్యత్వాలను చేరేందుకు ప్రతి ఒక్కరూ సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గాదె కృష్ణారావు, గాదె శేష గిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న గురుమూర్తి

వైరా: వైరా, కూసుమంచి, భద్రాచలంలో ఈ నెల 26న జరిగే మాదిగల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మట్టి గురుమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం వైరాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య న్యాయ కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేశారని ఆరోపిస్తూ మంద కృష్ణ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యాచరణ తీసుకోవడం బాధాకరమన్నారు. నాయకుల వ్యక్తిగత లాభాలు, జాతి ప్రయోజనాలను ఫణంగా పెట్టకూడదని హితవు పలికారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కోడాది ధీరన్, కన్నెగంటి వెంకటరాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

ముదిగొండ: మండలపరిధిలోని చిరుమర్రి వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలో వదిలేయడంతో వర్షాలకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కోలేటి ఉపేందర్‌రావు మాట్లాడుతూ.. వర్షాలకు వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయని, తక్షణమే పనులు పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు టీఎస్ కల్యాణ్, సామినేని రాంబాబు, సోమగాని లక్ష్మణ్, చావగాని లలిత, మాధవరావు, పల్లపాటి భద్రయ్య, ఉపేందర్, గురువయ్య, భారతమ్మ, సులోచన, ఇనప బాబు పాల్గొన్నారు.

నేడు 'వైరా'లో చేపపిల్లల విడుదల

వైరా: వైరా రిజర్వాయర్‌లో శనివారం చేపపిల్లలను విడుదల చేయనున్నట్టు మత్స్యశాఖ సహకార సంఘం సొసైటీ అధ్యక్షుడు షేక్ రహీం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బతుకమ్మ ఘాట్ వద్ద ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు.

నేటి నుంచి 'ఉపాధి' గ్రామసభలు

వేంసూరు: ఉపాధి హామీలో చేపట్టిన పనులపై 15వ విడుత ఆడిట్ గ్రామ సభలు శనివారం నుంచి నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. 19 తేదీ నుంచి 24 వరకు మండలంలోని 26 గ్రామం పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు. 19న ఎర్రగుంటపాడు, వెంకటపురం, 20న మొద్దులగూడెం, జయలక్ష్మీపురం, రాయుడుపాలెం శంబూనిగూడెం, బీరపల్లి, లింగపాలెంలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగొండ: మండలపరిధిలోని న్యూలక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ రామకృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని గౌరిగూడెం 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ శరత్‌బాబు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, సర్వారాయ, సిద్దారం మెయిన్ రోడ్, రాజీవ్‌నగర్‌లలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బోనకల్: మండలకేంద్రంలోని స్థానిక తహసీల్‌లో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను తహసీల్దార్ పున్నం చందర్ పంపిణీ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణ్, రమాదేవి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు గాలి దుర్గారావు, పీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, నాయకులు చేబ్రోలు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, గుగులోతు పంతు, గఫూర్, కొండలరావు, తదితరులున్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న తహసీల్దార్

రైతులకు అండగా కాంగ్రెస్..

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి
- ఉచితంగా మోటార్లు పంపిణీ



మోటార్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని రైతాంగానికి అండగా ఉంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి గ్రామంలో శుక్రవారం పంచాయతీ పరిధిలోని సత్యంపేట, బాసారం, కొమ్ముగూడెం, రుద్రాక్షపల్లిలో ఐటీడీఏ అనుమతితో బోర్లు వేసుకున్న ఎస్టీ, బీసీ, ఓసీ రైతులకు సింగరేణి సహకారంతో రూ.75 లక్షలు విలువ చేసే 30 మోటార్లను ఆమె రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సింగరేణి పీఓ నర్సింహారావు, ఎంపీడీఓ నర్సింహారావు, స్పెషలాఫీసర్ శ్రీధర్, సెక్రటరీ సురేష్‌రెడ్డి, సీడీపీఓ కనకదుర్గ, భరత్‌కుమార్, ఒగ్గు భూపతిరెడ్డి, నాగజ్యోతి, దామోదర్‌రావు, అర్జున్, వెంకటేశ్వరరావు, వసంతరావు, రామారావు, కృష్ణ ఉన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే సహించేది లేదు..

సత్తుపల్లిటౌన్: మున్సిపాల్టీ నిధులు దుర్వినియోగం చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధికారులను హెచ్చరించారు. సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అన్ని విభాగాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మున్సిపాల్టీలో రూ.40 లక్షలు నిధులు ఉన్నాయని కమిషనర్ ఎం.రవిబాబు వివరించగా.. నిధులు జాగ్రత్తగా ఖర్చు చేయాలని సూచించారు. శానిటేషన్ విభాగంలో అదనంగా మరో 10 మందిని నియమిస్తామన్నారు. ఎండి.కమల్‌పాషా, గాదె చెన్నారావు, దూదిపాల రాంబాబు, ఎస్‌కె మాలాలీ, పద్మజ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

టపాసుల నిల్వలు లేకుండా చూడాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ ప్రసాద్‌రావు

వేంసూరు: దీపావళి పండుగ దృష్ట్యా నివాస ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో టపాసులు అక్రమంగా నిల్వ లేకుండా చూడాలని, దీపావళి దుకాణాలకు అనుమతులు తీసుకోవాలని లా అండ్ ఆర్డర్ అడిషినల్ డీసీపీ ప్రసాద్‌రావు ఆదేశించారు. ఈ మేరకు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, జనరల్ డైరీ రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. శాంతిభద్రత, నేర నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్ స్టేషనరీ విభాగం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్–2 పరీక్ష కేంద్రాల పరిశీలన



పల్లిపాడు కార్తీక్ విద్యాలయంలో వసతులు పరిశీలిస్తున్న తహసీల్దార్ తఫజల్ హుస్సేన్

కొణిజర్ల: నవంబర్‌లో జరిగే గ్రూప్–2 పరీక్షల కోసం మండలంలో ఏర్పాటు చేయనున్న పరీక్షా కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ తఫజల్ హుస్సేన్ పరిశీలించారు. ఈ మేరకు తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల, బ్రౌన్స్ ఫార్మసీ కళాశాల, సెయింట్ అలోషియస్ హైస్కూల్, గ్రేస్ పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల తనికెళ్ల, కార్తీక్ విద్యాలయం పల్లిపాడు సెంటర్లలో గదులు, తాగునీటి, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు తదితర సౌకర్యాలు పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ రమేష్, సిబ్బంది ఉన్నారు.

హైడ్రా పేరుతో పథకాలు పక్కదోవ



మాట్లాడుతున్న కమల్‌రాజ్

బోనకల్: సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా పేరుతో ఆరు గ్యారంటీల పథకాలను ప్రజలకు అందించకుండా పక్కదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నాడని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని మాజీ జెడ్పీటీసీ బానోత్ కొండ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మాయమాటలు చెబుతూ కాలం గడుపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం 30 శాతం మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. ప్రతీ రైతుకు కేసీఆర్ ప్రభుత్వంలో ఎకరాకు పదివేల రూపాయలు రైతుబంధు ఇస్తుంటే దానిని రూ.15 వేలకు పెంచి ఇస్తామని మొండి చేయి చూపారన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, నాయకులు వేమూరి ప్రసాద్, కొనకంచి నాగరాజు, పారా ప్రసాద్, కొమ్మినేని ఉపేందర్, ఇటికాల శ్రీనివాసరావు, మూడవత్ సైదా మంగయ్య, మురళీ తదితరులున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

మధిర: మధిర పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ సిద్ధి వినాయక స్వామి దేవాలయం హుండీని శుక్రవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఖమ్మం విభాగం పరిశీలకులు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగగా రూ.88,322 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆలయ నిర్వహణ అధికారి సీహెచ్.రామకోటేశ్వరరావు, అర్చకులు హరి రావిశాస్త్రీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

సత్తుపల్లి: ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి జాజిరి జ్యోతి తెలిపారు. ఈ మేరకు మండలంలోని కాకర్లపల్లి, సిద్ధారం గ్రామాల్లో శుక్రవారం పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించి ప్రచారం చేశారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో కొత్తగూడెంలో జరగనున్న మహాసభలకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వేపులపాటి పుష్పావతి, సత్యవతి, నవీన్, పార్వతి, రేసు లక్ష్మి, నిర్మల ఉన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తప్పని ట్రాఫిక్ సమస్య..





రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వాహనాల రద్దీ

- నత్తనడకన ఓవర్ బ్రిడ్జి పనులు

మధిర: మధిర పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ప్రతీరోజూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. రైల్వే ఓవర్ బ్రిడ్జి మరమ్మతులకు నిధులు మంజూరవ్వగా బ్రిడ్జి పైన ఒక చోట మాత్రమే పనులు మొదలుపెట్టారు. ఈ పనులు ప్రారంభించి పది రోజులు కావస్తున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన నడుస్తున్నాయి. మధిర వన్ టౌన్ నుంచి టూ టౌన్ వైపు, మధిర నుంచి వైరా, తిరువూరు తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ బ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇది ఒక్కటే మార్గం కావడంతో పాటు వాహనాల రద్దీ పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా వర్షం కురిసినప్పుడు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వరద ప్రవహిస్తుంది. దీంతో కనీసం బైకులు కూడా ఆ రోడ్డులో వెళ్లే పరిస్థితి లేదు. బైకులు కూడా రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి వెళ్లాల్సి రావడంతో ట్రాఫిక్ మరింత పెరిగింది. మరమ్మతులు వెంటనే పూర్తిచేసి ట్రాఫిక్ సమస్యను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.